ఝడుపు కథ

రేణిగుంట ఉత్తమ్

# 67 నిముషాల తర్వాత?

నేను గంగాపురం స్టేషన్లో అడుగుపెట్టేసరికి రాత్రి పదకొండు గంటలయ్యింది. రివ్వుమని వీస్తున్న చలిగాలి ఝల్లున తాకి నా నిద్రమత్తును పోగొట్టింది.

దాదాపు ఎనిమిది గంటలు ఆలశ్యంగా నన్ను గమ్యానికి చేర్పించిన రైల్వేవారి ప్యాసింజర్ ట్రైన్ పొగలు చిమ్ముకుంటూ, ముందుకు సాగిపోయింది. నేను తప్ప మరెవరూ ఆ స్టేషన్లో దిగినట్లు కనిపించలేదునాకు.

పదేళ్ళ తర్వాత కూడా గంగాపురం రైల్వేస్టేషన్లో మార్పేమీ కనిపించకపోవడంతో ఆశ్చర్యమనిపించింది. గంగాపురం ఓ పల్లెటూరు.

ఆ పల్లెకు చేరాలంటే ఒక్క రైలుమార్గం తప్ప మరేమార్గమూ లేదు. అలాగే, రైల్వేస్టేషను నుండి వూరు చాలాదూరం... దాదాపు గంట ప్రయాణం చేయాల్సివుంటుంది. రైళ్ళ రాకపోకలు ఆ సమయంలో చాలా తక్కువగా వుంటుందనేమో రైల్వేస్టేషన్ నిర్మానుష్యంగా వుంది. కీచురాళ్ళ చప్పుడు తప్ప మరే అలికిడీ లేదు. దూరంగా వున్న సిమెంటు బెంచీపై శరీరాన్ని పూర్తిగా కనబడకుండా గొంగళిని కప్పుకుని పడుకున్న బిక్షగాడు వుండుండి దగ్గుతున్నాడు క్షయరోగిలా... మసగ్గా వెలుగుతున్న విద్యుద్దీపాల కాంతి, ఆరిన చితిపై కప్పుకున్న బూడిద పొరలా నీరసంగా వుంది.

నేను గంగాపురంలోని మూర్తిబావ ఇంటికి చేరుకోవాలిప్పుడు. రైళ్ళు ఏమీ లేకపోవడంతో స్టేషన్ బయట జట్కాలుగానీ, రిక్షాలుగానీ వున్నట్లు లేవు. ఏం చేయాలో తోచక స్టేషన్ మాస్టర్ గదిలోకి నడిచాను. గోడకు తగిలించిన రైల్వేమ్యాపును చూస్తూ అటు తిరిగి కూర్చున్న స్టేషన్‌మాస్టర్ నా అలికిడవటంతో తలతిప్పి నావంక ప్రశ్నార్థకంగా చూసాడు.

ఒళ్ళు జలదరించింది అతని వంక చూసినాకు రోమాంచితమై, జుగుప్సాకరమైన ఓ ఫీలింగ్ కలిగింది అతని మొఖం చూస్తుంటే. అక్కడక్కడా మాంసం అతికించినట్లున్న కపాలానికి సాక్ష్యాలడిగితే ఎలా వుంటుందో తెలియజేసింది అతని మొఖం. కాలిపోయిన చర్మాన్నీ లాగి దగ్గరకు చేర్చికుట్టడంవల్ల అతని కనుగుడ్లు పొడుచుకుని ముందుకు వచ్చినట్లు వికారంగా వున్నాయి.

"ఏం కావాలి?" భావరహితంగా సూటిగా నాకళ్ళల్లోకి చూస్తూ అడిగాడు. అతని మొఖం, మాట్లాడుతుంటే మరింత వికృతంగా కనిపించింది. అంత చలిలోనూ స్వేదంతో నా ఫాలభాగం నిండిపోవడం నాకు తెలుస్తూనేవుంది.

"గంగాపురం...వెళ్ళాలి...రిక్షాలేమైనా..." తడబడుతూ అడుగుతున్న నా మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ చెప్పాడతను. "ఈ టైంలో ఏమీ దొరకవు... నీకేమీ అభ్యంతరం లేకుంటే పొద్దుటివరకు ఇక్కడే వుండొచ్చు" చెబుతున్నప్పుడు భావరహితంగావున్న అతని చూపుల్లో కనిపించిన సన్నటి మెరుపు నా దృష్టినుండి తప్పించుకోలేకపోయింది. ఎందుకో అక్కణ్నుంచి వెంటనే పారిపోవాలనిపించింది నాకు.

బహుశా...భయం వల్ల కావచ్చు. కాళ్ళల్లో సన్నటి ప్రకంపనలు మొదలవడంతో తడబతుడూ, వెంటనే ఆగదిలోంచి బయటకొచ్చి నిల్చున్నాను. వెంట తెచ్చుకున్న సూట్‌కేస్ మరింత బరువనిపించింది ఆశ్చర్యంగా, ఆ గదిలోంచి బయటికొస్తున్నప్పుడు.

ఉద్యోగరీత్యా పదేళ్ళు గల్ఫ్‌లో గడిపిన నేను మొదటిసారిగా భయపడింది, సద్దాం హుస్సేన్ కువాయిట్‌ని ఆక్రమించుకున్న తర్వాత, మిత్రకూటమి ప్రయోగించిన మొదటి పేట్రియాట్ మిస్సయిల్ మా కాలనీ మీదపడి వందమంది భయానకంగా మృత్యువాత పడ్డప్పుడు. ఇండియాకి బ్రతికి వెళ్ళడం దుస్సాధ్యమని అర్థమైందా క్షణం నాకు. ఈ ప్రపంచంలో నాకున్న ఇద్దరు ఆత్మీయుల్లో ఒకరు అమ్మ. రెండవ వ్యక్తి మూర్తి బావ! అమ్మపోయాక ఢిల్లీ నుండి తనదగ్గరకు వచ్చేయమని ఎన్నోవిధాలుగా ప్రాధేయపడి, ఎన్నోరకాలుగా ప్రయత్నించిన మూర్తిబావకు ఒకటే చెప్పాను నేను. 'మరొకరిపై ఆధారపడి బ్రతకడం ఇష్టంలేదని, స్వయం కృషితో నాకాళ్ళపై నేను నిలబడాలనీను.' ఎం.బి.ఏ. తర్వాత ఇండియన్ నేషనల్ ఇన్‌ఫర్మేషన్ సర్వీసెస్ నుండి కంప్యూటర్ కోర్స్‌లో మాస్టర్ డిగ్రీ పొందిన తర్వాత లక్కీగా కువాయిట్‌లో ఓ ఆయిల్ కంపెనీలో జాబ్ దొరకడంతో ఇండియా వదలివెళ్ళిపోయాను.



ఇండియా నుండి వెళ్ళేముందు బావ కోరిక ప్రకారం, నేను గంగాపురం వచ్చి వారం రోజులు బావింట్లోవున్నాను. నేను అక్కడ వున్నన్ని రోజులు అత్తయ్య, మామయ్యలు నన్ను ఎంతో ఆదరించారు . ప్రపంచంలో నేను 'ఏకాకి'ని అన్న విషయాన్ని పూర్తిగా మరచిపోయాను అక్కడ గడిపిన వారం రోజులు. మూర్తి బావైతే క్షణం వదిలేవాడుకాదు నన్ను ఒంటరిగా. ఏ.జీ. బియస్సీ తర్వాత తనకున్న పదెకరాల పొలంలో చక్కగా వ్యవసాయం చేసుకుని సంతోషంగా గడిపే మూర్తిబావను చూసినపుడు, ఈ రోజుల్లో కూడా పల్లెటూర్లలో వుండడానికి ఇష్టపడే యువత వుందన్న సంగతే నన్ను ఆశ్చర్యపరిచేది. ఆ విషయమే బావతో అంటే, నవ్వి ఊరుకునేవాడు. 'తృప్తి' గురించి కూడా నాకు అర్థమైంది మూర్తిబావను చూసినపుడే.

గల్ఫ్ ఉద్యోగంలో జాయినయిన తర్వాత-మా మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు బాగానే సాగాయి. ఎందుకో గత సంవత్సరంగా ఇండియా నుండి ఉత్తరాలు రావడం మానేసాయి. బహుశా నేను ఆలశ్యంగా రిప్లయ్ ఇవ్వడంవల్ల బావకు కోపం వచ్చిందేమో... ఊహు... అలా ఎప్పటికీ జరగదు. పొలం పనులవల్ల బిజీగా వుండడం ఒక కారణమనుకుంటే, అత్తయ్య, మామయ్యలు చదువుకోని కారణంగా వాళ్ళు కూడా రాయలేదనిపించింది. బయటివాళ్ళతో ఉత్తరాలు రాయించడం వాళ్ళకు ఇష్టంలేకపోవడం కూడా ఒక కారణం కావచ్చు.

వచ్చేముందు బావకు వివరంగా ఉత్తరం రాసాను

నేనొస్తున్నట్లు. మరి నన్ను రిసీవ్ చేసుకోవడానికి ఎందుకు రాలేదో? బహుశా రైలు లేటయిన కారణంగా ఇంటికెళ్ళిపోయివుండవచ్చు.

"ఇంత రాత్రిపూట ఒంటరిగా వెళ్ళడం మంచిదికాదు." హఠాత్తుగా స్టేషన్‌మాస్టర్ స్వరం నా వెనుకనుండి వినబడ్డంతో ఆలోచనల్లో వున్న నేను, ఉలిక్కిపడి తేరుకుని అతనివైపుకి తిరిగాను. చప్పుడవకుండా అతను నా వెనుగ్గా ఎంతసేపటి క్రితం వచ్చి నిల్చున్నాడో తెలియదు. రెప్పవాల్చకుండా నన్నే చూస్తున్న అతన్ని అడిగాను చూపు మరల్చుకుని, "వెయిటింగ్ రూం ఎక్కడ వుం..." నా మాట పూర్తికాకమునుపే, కుడిచేత్తో చూపిస్తూ అన్నాడతను, "అదిగో... రైల్వే ట్రాక్ అవతల కనిపిస్తోంది చూడు... అదే! కానీ... ఆ గదిలో ఎలక్ట్రిక్ వైరింగ్ పాడయింది. లైట్లు లేవు... నా దగ్గర ఓ కొవ్వొత్తివుంది... ఇస్తానుండు" అంటూ తన గదిలోకి వెళ్ళాడు స్టేషన్‌మాస్టర్.

అతను చూపించిన దిశగా చూసిన నాకు బీటలువారిన ఓ గది కనిపించింది మసక వెలుతుర్లో. ఆ గదిని ఉపయోగించడం మానేసి చాలా రోజులైనట్లు తెలుస్తోంది. ఎందుకో, ఆ గదిలోకి వెళ్ళవద్దని నా సిక్స్త్ సెన్స్ పదేపదే హెచ్చరిస్తోంది నన్ను. ఆ గదిలోకి వెళ్ళడమా, మానడమా నిర్ణయించుకునేలోపునే ఓ చేతిలో కొవ్వొత్తి, మరో చేతిలో టార్చ్‌లైట్ పట్టుకుని వచ్చిన స్టేషన్ మాస్టర్‌తో చెప్పాను. ఓ నిశ్చయానికి వచ్చినట్లు, "నేను నడిచే గంగాపురం వెళతానులెండి..."

"ఎక్కడికి? గంగాపురానికా?... ఇంత రాత్రి పూట వెళ్ళడం మంచిది కాదు." నిర్నిమేషంగా చూస్తున్న అతని చూపుల్లో ఎక్కడో, ఏమూలో రవంత నిరాశ కనిపించింది. ఇక అక్కడ వుండటం కంటే కష్టమైనా, నష్టమైనా, నడచి గంగాపురం చేరుకోవడమే నయమనిపించింది.

నేలమీదున్న సూట్‌కేస్‌ను అందుకుని స్టేషన్ బయటకు అడుగులేస్తున్న నన్ను ఉద్దేశించి, స్టేషన్ మాస్టర్ అంటున్న మాటలు నా చెవినపడ్డాయి. "దారి అంత మంచిది కాదు... దయ్యాలుంటాయి... జాగ్రత్తగా వెళ్ళు."

మూసివున్న రైల్వే స్టేషన్ ఎంట్రన్స్ గేట్‌ను నెట్టాను బలంగా. వెంటనే తెరుచుకోకపోవడంతో రెండు క్షణాలు కష్టపడ్డాక 'కిర్రు'మని శబ్దం చేస్తూ తెరుచుకుంది. స్టేషన్‌లోంచి బయటకు అడుగుపెట్టిన నాకు, చేతి గడియారంలోని ఆటోమేటిక్ అలారం సిస్టం సరిగ్గా అర్ధరాత్రి అయిన సూచనగా మ్రోగింది. చీమ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దంగావున్న వాతావరణంలో అలారం మ్రోగడంతో ఉలిక్కిపడ్డానోక్షణం. తేరుకుని ఊరివైపుకి అడుగులేస్తున్న నాకు స్వాగతం పలుకుతున్నట్లుగా రోడ్డంతా మంచు కురుస్తోంది.... చల్లగా...

చలిబారి నుండి తప్పుకోవడానికి నేను ధరించిన ఉలెన్ జర్కిన్‌ను ఓసారి సర్దుకుని వూరివైపుకు నడవనారంభించాను వేగంగా.

పదడుగులు నడిచిన పిదప హఠాత్తుగా నా కాళ్ళకు సంకెళ్ళు పడ్డాయి. ఘల్లుఘల్లుమని కాలి అందెల చప్పుడు వినిపించడంతో... నేను ఆగడంతో హఠాత్తుగా ఆ చప్పుడు కూడా ఆగింది. చుట్టూ పరికించి చూశాను. ఎవరూ కనిపించలేదు... మెల్లగా అడుగులేసాను ఊరివైపుకి. ఈసారి... మరింత స్పష్టంగా దగ్గరగా వినిపించిందా శబ్దం. ఘల్లు, ఘల్లుమని లయబద్ధంగా... నా నడక వేగంగా మారడం ఆక్షణంలో నాకు గుర్తులేదు. ఆంజనేయ దండకాన్ని మననం చేసుకుందామని ప్రయత్నించాను. కానీ ఎందుకో... సరిగ్గా ఉచ్చరించలేకపోయాను...

మరో పది నిముషాల నడక తర్వాత ఆగిపోయింది అందెల సవ్వడి. దాని వెనుకే, రోడ్డు ప్రక్కనున్న చెట్ల నుండి వినిపించింది హృదయవిదారకమైన ఓ తీతువుపిట్ట అరుపు. గగుర్పాటులో నా వళ్ళంతా వణికినట్లయ్యింది ఆక్షణం... సర్దుకుని మరికొన్ని అడుగులు నడిచిన తర్వాత కుడివైపు నుండి నక్కల ఊళలు వినిపించాయి వికృతంగా. భయానకంగావున్న వాతావరణానికి కావచ్చు నా గుండె వేగంగా స్పందించడం ప్రారంభించింది.

హృదయ స్పందన పెరగడంతో నా గుండె చేస్తున్న చప్పుడు నా చెవులకు వింతగా వినిపిస్తోంది. భీతివల్ల నా నాలుక పిడుచకట్టుకుపోయింది. 'రైల్వే స్టేషన్ నుండి బయటకొచ్చి తప్పుచేసానా...?' అన్న ఫీలింగ్ కలిగిందా క్షణంలో. అయినా, గుండెను దిటవు పరచుకుని ముందుకెళ్ళడానికే నిర్ణయించుకున్నాను. వెనక్కి తిరిగి చూడకుండా మరో పదడుగులు నడచిన తర్వాత, నాకు వ్యతిరేక దిశలో ఎవరో నడచి వస్తున్నట్లు అడుగుల చప్పుడు స్పష్టంగా వినిపించసాగింది. ఆశ్చర్యంగా, అటువైపుకి చూసిన నాకు సన్నగా, పొడుగ్గావున్న ఓ వ్యక్తి వస్తూ కనిపించాడు నావైపుకి. బాగా దగ్గరకు వచ్చాకగానీ పోల్చుకోలేకపోయాను అతనెవరో?

ఆ వ్యక్తి.... మూర్తిబావ!

హమ్మయ్య! మూర్తిబావ వచ్చేశాడు. ఇక భయంలేదు. అప్పటివరకు టెన్షన్‌గా ఫీలయినందుకు, పిరికిగా ప్రవర్తించినందుకు కించిత్తు సిగ్గుపడ్డాను. బాగా దగరకు వచ్చిన తర్వాత చెప్పాడు మూర్తిబావ తను రావడానికెందుకాలశ్యమైందో. "సారీ డియర్! ఆలశ్యమైపోయింది. ఈ వేళసలు ట్రైన్ రాదనుకున్నాను... స్టేషన్ మాస్టర్ కూడా అదే అన్నాడు... బాగా ఆలశ్యమౌతుందని... పక్క ఊళ్ళో జాతర జరుగుతుంటే వెళ్ళాను... అక్కడ తెలిసింది... ట్రైన్ ఎనిమిది గంటలు ఆలశ్యంగా వచ్చిందని... ఊళ్ళో జట్కాలు, ఎడ్లబండ్లు అన్నీ జాతరకెళ్ళిపోయాయి... సరే... పద పద..." అపాలజిటిక్‌గా చెబుతుంటే అన్నానతనితో "పర్వాలేదులే బావా? నువ్వెలావున్నావ్? అసలేమిటి... ఇంత చిక్కిపోయావ్? నీ ఆరోగ్యం బాగాలేదా?"

"అబ్బే! అదేం లేదోయ్! పనుల ఒత్తిడి... అంతే!" అతను నా సూట్‌కేసును అందుకుని నడుస్తూంటే, అతని వెనుకే వడివడిగా నడవడం



## కారణం

"ఏమోయ్! శంకరం మీ పెళ్ళికి నాకు వెడ్డింగ్ కార్డు ఇవ్వలేదేంటి?'

"నీవు తప్పకుండా వస్తావని"

".....!!.....??"


— ఎస్సార్ కాయిత
(ఆర్నకొండ)



## నటీమణులు

దివ్య ఆకస్మిక మరణం తర్వాత 'కర్తవ్య' సిన్మాలో హీరోయిన్‌గా చేస్తోన్న 'జుహీ'కి అత్తగారిగా నటించనని డింపుల్ మొండికేసింది. ఆతర్వాత అదంతా పెద్ద గొడవైపోయింది.

మొన్నీ మధ్య జుహీ, డింపుల్ హోటేల్లో ఒకరికొకరు ఎదురుపడ్డారు. ఇద్దరూ అమాంతంగా కౌగిలించేసు కున్నారు. 'జుహీ! నేను నీకు వ్యతిరేకంగా పోట్లాట్టం లేదు. ఇదంతా మిగిలిన విషయాల గురించి, అంటూ డింపుల్ ఎంతో ప్రేమతో సర్దిచెప్పింది. —జెమిని





## అనుమానం

"నాకు ఎడమవైపు పక్షవాతం వచ్చినట్టు అనుమానంగా వుంది." సినిమా హాల్లో పక్కనున్న భార్య అనసూయతో అన్నాడు రాంబాబు ఆందోళనగా.

"ఆ అనుమానం ఎందుకొచ్చింది?" అడిగిందామె.

"చెయ్యి మీద గిల్లి చూసుకుంటున్నాను. కానీ స్పర్శ తెలియటం లేదు" భయంగా చెప్పాడు.

"ఏడ్చినట్టుంది ఇందాకట్నుంచీ మీరు గిల్లుతున్నది నా చేతిమీద' ' చెప్పింది అనసూయ.

— ఎస్.బి.కళ్యాణి
(బెండమూర్లంక)

ప్రారంభించాను. అరగంట నడిచాక ఊరి పొలిమేరల్లో ప్రవేశించాము ఇద్దరం. ఊళ్ళోకి అడుగుపెడుతుండగా చెప్పాడు బావా, "నువ్వో సహాయం చెయ్యాలి ప్రసూ... 'రవి', అని నాకో స్నేహితుడున్నాడు. ఈసారి నువు మళ్ళీ గల్ఫ్ వెళితే అతనికో ఉద్యోగం చూసిపెట్టాలక్కడ."

"అలాగేలే బావా... నువ్వింతగా చెప్పాలా...?" అన్నాను అతని కళ్ళల్లోకి చూస్తూ... మరో రెండు నిముషాల తర్వాత చేరుకున్నాం మూర్తి బావ ఇల్లున్న వీధిలోకి. ఇంకో నాలుగడుగుల్లో ఇంటికి చేరుకుంటామనగా హడావుడిగా చెప్పాడు, "నేను ఇప్పుడే వస్తాను ప్రసూ... రవికి చెప్పాలి నువ్వొచ్చావని... సాయంత్రం అతను కూడా వచ్చాడు నీ కోసం రైల్వేస్టేషన్‌కి" అంటూ సూట్‌కేస్‌ను నాకందించాడు. చల్లగా మంచుముద్దలావున్న అతని చేతి స్పర్శ షాక్ కొట్టిన ఫీలింగ్ కలిగించింది నాకు. బహుశా... విపరీతమైన చలి వల్ల కావచ్చు. అప్పుడు గమనించాను. అతను నాలా చలి నుండి శరీరాన్ని కాపాడుకోవడానికై ఎటువంటి ఉన్ని బట్టల్నిగానీ, స్వెట్టర్‌నుగానీ, శాలువగానీ ధరించలేదని. ఆశ్చర్యమనిపించింది... పల్లెల్లోనివారికి అలవాటే అనుకున్నా, ఎందుకో అతన్ని ఆపాను. నేను ధరించిన జర్కిన్‌ను విప్పి అతనికి ఇవ్వబోయాను. నవ్వుతూ వద్దని వెళ్ళిపోయాడు. క్షణం తర్వాత కదిలి ఇంటికి చేరుకున్న నేను, తలుపు తట్టాను. రెండు నిముషాల తర్వాత మామయ్య గొంతు వినిపించింది... "ఎవరూ...?" అని. చెప్పాను. మరుక్షణం తలుపులు తెరుచుకున్నాయి. అంత రాత్రిపూట నేను ఒంటరిగా రావడంతో, మామయ్య, అత్తయ్యలను అప్పటిదాకా కప్పేసిన నిద్రమత్తు హఠాత్తుగా వదలిపోయినట్లయింది. ఆశ్చర్యంగా నావంక చూస్తూ, ఆప్యాయంగా నన్ను లోపలికి తీసుకెళ్ళిన తర్వాత అడిగారు, "ఇంతరాత్రివేళ రావడమేమిటి ప్రసూ... స్టేషన్లో వుండి ప్రొద్దుటే రావచ్చుగా... ఒంటరిగా... ఎలా రాగలిగావసలు...?" అడుగుతున్న మామయ్యకు సమాధానం చెప్పేలోపున కాఫీ కప్పుతో ప్రత్యక్షమైన అత్తయ్య, కప్పును నా కందిస్తూ అడిగింది, "నువు వస్తున్నావని తెలిసి రవిని స్టేషన్‌కు పంపించానమ్మా... బండికట్టి... రైలు రావడం ఆలశ్యమౌతుందని ప్రొద్దుటిదాకా రాదని, ప్రక్క ఊళ్ళో జాతరకి వెళ్ళాడు... ఇంత రాత్రిపూట ఒంటరిగా రావడమేమిటే అమ్మాయి...?" ఆశ్చర్యంగా, రవంత కోపంగా, భయంగా అడుగుతున్న అత్తయ్యతో అన్నాను నవ్వుతూ... "అదేమిటత్తయ్యా మూర్తి బావ వచ్చాడుగా... దార్లో కలిశాడు... నన్ను ఇంటిదాకా తీసుకొచ్చి వదలి... రవిని తీసుకొస్తానని వెళ్ళాడు... ఇంతకీ... ఎవరత్తయ్యా... ఈ రవి...?" ఆపేసాను హఠాత్తుగా నా ఎదురుగా నిల్చున్న మామయ్య, అత్తయ్యలు నేను చెబుతోంది వింటూ నిశ్చేష్టులైపోవడం చూసి... ముందుగా తేరుకున్న అత్తయ్య, నోటికి కొంగు అడ్డుపెట్టుకుని రోదించడం మొదలెట్టింది... సన్నగా...! జరుగుతున్నది అర్థం చేసుకోలేక మామయ్య వంక చూసాను... "నీ మూర్తి బావ లేడమ్మా...! చనిపోయి... సరిగ్గా సంవత్సరమైంది..." పాలిపోయిన మొఖంతో చెబుతున్న మామయ్య కొనసాగించాడు.... "పట్నం వెళ్ళి రైలు దిగి జట్కాలో వస్తున్న మూర్తి... గుర్రం అదుపుతప్పడంతో... జట్కాతో సహా... లోయలోకి జారిపోయాడు. ఎవరూ మిగల్లేదు..." వింటున్న నేను కర్రటాటలా బిగుసుకుపోయాను.

నా చేతిలోని కాఫీ కప్పు చేజారి క్రిందపడి భళ్ళున పగిలింది, నా హృదయంలా!


"నీ భవిష్యత్తును పాడుచేయడం ఇష్టంలేక... ఇప్పటి వరకూ తెలియజేయలేదు. ప్రసూన... మమల్ని మన్నించమ్మా!" చెబుతున్నాడు మామయ్య.

'అయితే... మామయ్య ఇంటిదాకా నన్ను తీసుకొచ్చింది... మూర్తి బావ ఆత్మ!?' ఆలోచన నా మెదడులోకి రావడమే ఆలశ్యం, వెన్నులోంచి పుట్టుకొచ్చిన చలి నన్ను నిలవనీయలేదు.

మరుక్షణం నాకు స్పృహ తప్పిందని మగతగా తెలుస్తూనేవుంది...

*








## డైట్

ఒళ్ళు పెరక్కుండా చూసుకోటం నిజంగా హీరోయిన్లకి కత్తిమీద సామే! ఎంత సంపాదించినా కడుపునిండా తింటానికి లేదు. చచ్చినట్టు డయిట్ కంట్రోల్ చేయాల్సిందే. పూజాభట్ ఒక గమ్మత్తయిన కంట్రోల్ చేస్తుంది. ఒక రోజు మొత్తం ఒకే రకమైన ఆహారం తీసుకుంటుంది. అంటే పుచ్చకాయ తినాలన్పిస్తే ఒక రోజంతా అవే తింటుంది. అలాగే నారింజ, యాపిల్స్...

ఈ పద్ధతి బావుంది కదూ అటు నోరూ కట్టేసుకోనక్కర్లేదు. ఇటు ఒళ్ళూ రాదు.

—జెమిని

